# శాంతి సాగరం - (జిన్నూరు) నాన్నగారు

తెలుగు అనువాదం : శ్రీ పింగళి సూర్య సుందరం

ఆంగ్లమూలం : శ్రీమతి అంబికా ఉదయ నారాయణ్

విస్తృతమైన సాగరం పైకి ఎంతో ప్రశాంతంగా ఉన్నట్టు కనబడుతుంది. వర్షాకాలపు నీళ్లతో నిండి ప్రవహిస్తూ వచ్చే నదులు ఆ సాగరంలో కలసినా, వేసవిలో ఒక చుక్క నీరు కలవకపోయినా సాగరం ప్రశాంతంగానే ఉంటుంది. ఆ సాగరపు అగాధాలలో దాగి ఉన్నాయి అసలైన సిరులన్నీ. అసంఖ్యాకమైన జీవరాశులకి ఆలవాలం సాగరం, రత్నాలకీ ఇంకా ఎన్నిటికో కూడ సాగరం నిలయమే.

సాగరం వలెనే సద్గురువు కూడ ప్రశాంతుడే. తనకు గల జ్ఞానాన్ని ప్రదర్శించడానికి ఏ ప్రయత్నమూ చేయకుండా మిగిలిన వాళ్లతో బాటే ఆయన నవ్వుతారు, మాట్లాడతారు, వింటారు. ఎప్పుడూ అప్రమత్తంగానే ఉంటూ, నీ జీవిత గమ్యాన్ని నీవు చేరడానికి నీతో సహకరిస్తూనే ఉంటారు.

సద్గురు నాన్నగారు శాంతి సాగరం. అపురూపమైన రత్నం. ఆయన్ని దర్శించడమన్నా, ఆయన మాటలని వినడమన్నా మన భాగ్యమే. అనంతమైన ఆనందాన్ని ఆయన అనుభవ సిద్ధం చేసుకున్నారు. కాని దాని గురించి ఏ ఆర్భాటమూ చేయరు. మనం గ్రహించాల్సిన సిరి అంతా ఆయన మౌన లోతుల్లోనే ఉన్నది.

ఆయన మౌనం మన చెవుల్లో మార్మోగుతుంది. మన ఆలోచనలన్నిటినీ తీసేసి మనల్ని శాంతపరచే శక్తి ఉంది దానికి ఆయన కరుణామయ వీక్షణం, బాధాతప్తమైన మన మనస్సులని శాంతపరుస్తుంది. ఒక్క చూపుతో మన గతం, భవితవ్యం ఆయన గ్రహిస్తారు. ఆయన వద్ద నుండి దేనినీ దాచలేము. ఆయన కళ్లు అన్నిటినీ చూడగలవు. ధనికులైనా, నిరుపేదలైనా అందరూ ఆయనకి సమానులే. తమ వ్యాపారం గురించో, విద్య గురించో, వివాహం గురించో, ఉద్యోగం గురించో, ఆయన సలహాని కోరుతూ వస్తారెందరో. అందరికీ సముచితమైన సలహాలిస్తారు. ఎవ్వరూ రిక్త హస్తాలతో తిరిగిపోరు. ఇవన్నీ జరుగుతున్నా ఆయనలో ప్రశాంతత చెక్కు చెదరదు.

ఆయనని ఆశ్రయించిన వారంతా అదృష్టవంతులే. జీవిత లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆయన బోధించే మార్గం సరళమైనది. ఉపవాసాలు చేయమని గానీ, ధ్యానం చేయమని గానీ, క్రతువులు చేయమని గానీ ఆయనేమీ చెప్పరు. నీ మనస్సులో మెదిలే ఆలోచనలని గమనించమని సరళమైన భాషలో చెప్తారు.

భగవాన్ రమణుల స్వప్న దర్శనమైంది నాన్నగారికి. శ్రీ భూపతిరాజు వెంకట లక్ష్మీ నరసింహరాజు గారు 1934లో పశ్చిమగోదావరి జిల్లా కొమ్మర గ్రామంలో జన్మించారు. ఆయనని అందరూ ఆప్యాయంగా 'నాన్నగారు' అంటారు. జిన్నూరుని తమ నివాసంగా ఎంచుకొని దాదాపు ఏభై సంవత్సరాల పైగా భగవాన్ రమణ మహర్షి బోధలని అందరికీ అందిస్తున్నారు. తమ కోమలత్వంతో, నిరాడంబరతతో, మౌనంతో అందరికీ ప్రీతి పాత్రులయ్యారు నాన్నగారు.

'నాన్నగారు' అన్న పిలుపే చాలు - ఆయనకీ, భక్తులకీ బంధం పెరగడానికి. ఎప్పుడూ తెల్లని బట్టలనే ధరిస్తుండే నాన్నగారిని దర్శించుకోవడమే డస్సిపోయిన దేహమూ, మనస్సు చేయవలసింది. ఈ సమాగమమే జీవితం పట్ల మన దృక్పథాన్ని మార్చేస్తుంది. అందరికీ సులభులు నాన్నగారు. మన వర్తమాన జీవితం మన పూర్వకృత కర్మల ఫలితమని నాన్నగారు స్పష్టంగా చెప్తారు. గతించిన కర్మల గురించి మనం చేయగలిగిందేమీ లేదు. ఆయన మార్గదర్శకత్వం వల్ల మన భవిష్యత్తు తప్పకుండా మెరుగవుతుంది. ఆయన భాష సరళం. ఆయన ఇచ్చే సలహా జ్ఞానమయ గుళిక.

ఆయన శ్రీరామకృష్ణ పరమహంస గురించిగానీ, వివేకానందుల గురించిగాని మాట్లాడేటప్పుడు ఆయా మూర్తులు తానే అయిపోతారు. శ్రీరామకృష్ణుని గురించి చెప్పేటప్పుడు పరమహంస పాటలూ, అనుభవాలూ, బోధలూ మనకెంతో స్పష్టంగా తెలియచేస్తారు. మనం ఆ వెనుకటి కాలానికి వెళ్లి పోయినట్టూ మనకి శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమై మన ఎదుట ఆసీనులైనట్టూ అనుభూతి కలుగుతుంది. అదేవిధంగా ఉత్తేజపరచే వివేకానందుల ఉపన్యాసాలను - ముఖ్యంగా

పాశ్చాత్యులకు వేదాంతాన్ని వివరించే వాటిని - చెప్తున్నప్పుడు నాన్నగారు వివేకానందులే అయిపోతారు. గౌతమ బుద్ధుని జీవిత వృత్తాంతాలూ, ఆనందునికి ఇచ్చిన బోధలూ చెప్పేటప్పుడు కూడా అలాగే బుద్ధుడే అయిపోతారు.

నాన్నగారి ఉద్దేశంలో అసలైన గురువెవ్వరూ గుర్తింపు కోసం ప్రాకులాడడు. మనిషిలో పరివర్తన తీసుకురావడానికే గురువు ప్రయత్నిస్తాడు. తనపట్ల భక్తుడు లగ్నమయ్యేట్టు చేస్తాడు. మనతోనే మసలుతు గురువు మనలో మార్పును తీసుకువస్తారు. తన వర్తనం వల్ల మన కొక మార్గదర్శకుడవుతారు.

గుర్తింపు కోసం తాపత్రయపడవద్దని పదేపదే చెప్తుంటారు నాన్నగారు. ఏ పనినైనా చేసేటప్పుడు దృష్టి అంతా ఆ పనిని పూర్తి చేయటంపైనే ఉండాలిగాని, ఆ పనివల్ల కలిగే ఫలితాల మీద ఉండకూడదంటారు. సక్రమంగా పని పూర్తయితే గుర్తింపు తనంతట తానే లభిస్తుందంటారు.

ధనం సంతోషాన్ని ఎప్పుడూ కలిగించదంటారు నాన్నగారు. నిర్మలమైన మనస్సు ఎంతో సంతోషానిస్తుందంటారు. ఉన్న సంపద గురించి ఏ ఆర్భాటమూ చేయవద్దంటారు. కేవలం ధనమే ఎవ్వరినీ సంపన్నుని చేయదు. వినమ్రత, స్వచ్ఛమైన మనస్సు ఇవే మనిషిని సంపన్నుని చేస్తాయి. బుట్టలోని రసాలుపైకి ఎంత బాగా కనబడినా, అవి లోపల పాడైపోయి ఉంటే ఎందుకూ పనికి రావు. లోపల తీపిదనముంటేనే మామిడిపళ్లు రుచిగా ఉంటాయి.

ఎవరికైనా సహాయం చేస్తే అది ఇంకొకరికి మనం చేసిన ఘనకార్యంగా అనుకోకూడదు. ఆ కాస్త ఉపకృతే ఘనకార్యమనుకుటుంది మనస్సు వెంటనే. ఇతరులకు సహాయాన్ని శక్తివంచన లేకుండా చెయ్యాలి. నీకీ అవకాశం భగవంతుడివ్వడంలో ఉద్దేశం నీ మనస్సు నిర్మలమవడానికే అని గుర్తుంచుకో. అంటే కుడి చేతితో ఇచ్చి, ఎడమచేతితో తీసుకోవడం వంటిదే ఇది. అటువంటప్పుడు 'ఉపకృతి' అనే మాట ఎట్లా వస్తుంది - రెండు చేతులూ నీవే కదా!

ఆధ్యాత్మిక ప్రస్థానంలో, ప్రపంచం పట్ల మమకారముండటమే గొప్ప అవరోధం. మమతారహితంగా ఉండేట్టుగా మనస్సుని తర్ఫీదు చేయమంటారు నాన్నగారు. ఆ మమకారాన్ని అంతరంగంలోకి తీసుకువెళ్లి ఆ శాంతి సాగరాన్ని అనుభవించమంటారు.

ఆత్మాన్వేషణలో నిలకడగా నిలవడానికి మన దృక్పథంలో మార్పు రావాలంటారు. అందువల్ల ప్రథమంగా మనం చేయవలసింది మన దృక్పథంలో మార్పు తెచ్చుకోవడం. జ్ఞానమూ, వినయము, సేవా భావము లేకపోతే ఎవ్వరిలోనూ మార్పు తీసుకురావడం కుదరదంటారు నాన్నగారు. ఇతరుల వికాసానికి ఎన్నో అవకాశాలివ్వవచ్చు కాని ఆ వ్యక్తిలో మార్పుని బలవంతంగా తీసుకురాలేము. 'మారాలి' అనే భావన లోపల నుంచి రావాలి. అట్లాగే పరమాత్మ గురించి తెలుసుకోవాలనే కోర్కె కూడా లోపల నుంచే రావాలి.

**నాన్నగారి అమృత వాక్కులివి :**

- నీ హృదయంలోని సత్యాన్ని గ్రహించడమే జీవిత లక్ష్యం.
- ఆత్మ సాక్షాత్కారమయ్యే వరకూ నిన్ను మాయ వెంటాడుతూనే ఉంటుంది.
- అసలైన సంతోషం నీలోనే ఉంది. బయటి నుంచి రాదు. ఈ విషయం గ్రహించడమే పరమ జ్ఞానానికి బాట అవుతుంది.
- ధనంతోబాటు, మేధా సంపత్తి కూడా ఎక్కువ అవుతుండాలి. కేవలం ధనమే ఎక్కువైతే అది ప్రమాదకరమవుతుంది.
- గురువుకిగాని, దైవానికిగాని శరణాగతి చెందడమే పరిపూర్ణమైన శరణాగతి. ఈ ప్రపత్తే అసలైన ప్రార్థన.
- మనమే రంగంలో ఉన్నా గుర్తింపుకోసం ప్రాకులాడకూడదు. ఆ గుర్తింపు తనంతట తానే లభిస్తే మనల్ని పరిమితం చేయదు. ఖ్యాతి కోసం ప్రాకులాడటమే నిన్ను బందీని చేస్తుంది.

★ ★ ★